ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-12.2025 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో ఐటీ, ఫార్మా, రక్షణ రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.
2. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కోసం శాశ్వత అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.
3. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక న్యాయానికి ఇస్తున్న ప్రాధాన్యతను చూసి తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు అత్యధిక స్థానాల్లో గెలుపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు
4. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో రేపు రాత్రి ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్ కోసం 2 వేల 500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు.

----------------------------------

భట్టి-జర్మనీ

రాష్ట్రంలో ఐటీ, ఫార్మా, రక్షణ రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ రోజు హైదరాబాద్ ప్రజా భవన్ లో

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంట్ బృందంతో విక్రమార్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్మనీ, భారత్ మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఉందని జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి  దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సైబర్ సెక్యూరిటీ విషయాల్లో చాలా దూర దృష్టితో సైబర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని వివరించారు.

**(పీఎస్)**

----------------------

**మేడారం-పొంగులేటి**

మేడారం  సమ్మక్క, సారలమ్మ జాతర కోసం శాశ్వత అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని, గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టినట్టు మంత్రి తెలిపారు. మేడారం ప్రాంగణాన్ని మహా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని, ఈ జాతరకు హాజరయ్యే కోటి మందికి పైగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా 50 కిలోమీటర్ల పరిధిలో అన్ని రకాల అభివృద్ధి పనులకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో  మంత్రి సీతక్క, ఉన్నతాధికారులతో జాతర అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం పనులను సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు, మరో వందేళ్ల వరకు భక్తులకు అసౌకర్యం లేకుండా చూసే విధంగా నిర్మాణాల నాణ్యతను పాటిస్తూ, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను మంత్రి ఆదేశించారు. జాతర ప్రారంభం నాటికి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. తుది దశకు చేరుకుంటున్న నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి వారం రోజులకు ఒకసారి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, తాను స్వయంగా వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షిస్తామని తెలిపారు.

**(పీఎస్)**

---------------------------

**ఎన్నికలు-మహేశ్ గౌడ్**

తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలిచారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక న్యాయం కోణంలో ఇస్తున్న ప్రాధాన్యత వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేసినప్పటికీ, ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చోట్ల కూడా 90 శాతానికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారని పేర్కొన్నారు. ఈ విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

**(డెస్క్)**

------------------------

**నోరి దత్తాత్రేయ-సీఎం**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 విజయవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందనలు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ చారిత్రాత్మక విజయమని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. డీప్టెక్, గ్రీన్ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ వంటి రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ కు, ముఖ్యమంత్రి పాలన, స్థిరత్వం, భవిష్యత్తుపైన ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపు కోసం చేస్తున్న ప్రయత్నాలు హర్షనీయమని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పేర్కొన్నారు. ప్రజారోగ్యంలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి పెట్టుబడులు ఉపయోగపడుతాయని చెప్పారు. క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్ గా నిలబడే అవకాశాలున్నాయని అన్నారు.

**(పీఎస్)**

-----------------------------

**సీఎం-అరవింద్ సుబ్రమణియన్**

భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు, ఆర్థికవేత్త ఆచార్య అరవింద్ సుబ్రమణియన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో ఈ రోజు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ఆవిష్కరించి, అనుసరించడం ద్వారా రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తుందని ఆయన చెప్పారు. ఈ నెల 8, 9వ తేదీల్లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 లో అరవింద్ సుబ్రమణియన్ పాల్గొన్నారు.

**(డెస్క్)**

---------------------------

**కవిత**

తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె. కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో తాను కలిసి పనిచేస్తున్నట్లు కొందరు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హైదరాబాద్ లో ఈ రోజు జరిగిన విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. తనకు ఏ రాజకీయ నాయకుడితోనూ ఎలాంటి రహస్య అవగాహనలు లేవని, వ్యాపార లావాదేవీలు లేవని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో తనకు సంబంధం లేదని, ఎంపీగా ఉన్నప్పుడు ఢిల్లీ, నిజామాబాద్ కే పరిమితమయ్యానని కవిత స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్ని అన్యాయాలను వెలికితీస్తానని తెలిపారు. తనపై, తన భర్తపై తప్పుడు అరోపణలు చేసిందుకు వారం రోజుల్లో క్షమాపణ చెప్పాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుకు నోటీసులు పంపుతున్నాట్టు తెలిపారు. కృష్ణారావు కుమారుడు డైరెక్టర్ గా ఉన్న కంపెనీ ప్రభుత్వ స్థలాలను, చెరువులను ఆక్రమించిందని దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**(డెస్క్)**

--------------------------

**మెస్సీ -సీపీ**

హైదరాబాద్ లో ఉప్పల్ స్టేడియంలో రేపు రాత్రి 7 గంటలకు ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్ కోసం 2 వేల 500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. టికెట్లు ఉన్నవారు మాత్రమే స్టేడియానికి రావాలని ప్రేక్షకులకు సూచించారు.ఈ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేపు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులను అమలు చేయనున్నట్లు కమిషనర్ ప్రకటించారు. రేపు

మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11 గంటల 50 నిమిషాల వరకూ  భారీ వాహనాల రాకపోకలను పూర్తిగా దారి మళ్లించనున్నారు.  మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల 50 నిమిషాల వరకూ ఫలక్ నుమా- సంతోష్ నగర్-  ఉప్పల్,  సికింద్రాబాద్- హబ్సిగూడ- ఉప్పల్ మార్గాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉండటంతో  పౌరులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని రాచకొండ పోలీసులు సూచించారు.

**(డెస్క్)**

--------------------------

**జనగామ జిల్లా కలెక్టర్- జల్ ప్రహరీ పురస్కారం**

భూగర్భ జల సంరక్షణ, నీటి పునరుద్ధరణ, నీటి వనరుల పరిరక్షణ  పద్ధతుల అమలుతో జనగామ జిల్లాలో భూగర్భ జల వనరులు పెరిగిన దృష్ట్యా  కేంద్ర ప్రభుత్వం  జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ను అభినందిస్తూ జల్ ప్రహర్ పురస్కారాన్ని ప్రకటించింది.  రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక కలెక్టర్ గా రిజ్వాన్ భాషా నిలిచారు.  దీని పట్ల జిల్లా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. నిన్న న్యూ ఢిల్లీ లోని మహారాష్ట్ర సదన్ లో జరిగిన 6 వ జల్ ప్రహరీ సమ్మాన్ కార్యక్రమం లో జల శక్తి కేంద్ర మంత్రి CR పాటిల్ పురస్కారాలను అందజేశారు. అయితే స్థానిక సంస్థల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల జిల్లా కలెక్టర్ ఈ అవార్డు కార్యక్రమంలో పాల్గొనలేదు.

**(పీటీసీ, జనగామ)**

-----------------------

జగిత్యాల-నోటీసులు

జగిత్యాల జిల్లాలో  మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల విధులకు గైర్హాజరైన  వివిధ శాఖలకు చెందిన 89 మంది సిబ్బందికి  జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ

చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**(జగిత్యాల జిల్లా, పీటీసీ)**

----------------------------

**భద్రాచలం-ముక్కోటి ఏకాదశి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని  భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 29, 30వ తేదీల్లో జరిగే ముక్కోటి ఏకాదశి పర్వదిన గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే విధంగా రాష్ట్రమంతట గోడ పత్రికలు అతికించాలని అధికారులకు సూచించారు.

**(PTC-B. KGM)**

----------------------------

**వనపర్తి-కలెక్టర్**

వనపర్తి జిల్లాలో రెండో గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను ప్రణాళికా బద్దంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఎల్లుండి జరిగే  రెండో విడత పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**(పిటిసి, వనపర్తి )**

-------------------------

**ఖమ్మం-కలెక్టర్**

ఖమ్మం జిల్లాలో రెండవ విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ అనుదీప్ విలేకరులకు చెప్పారు. జిల్లాలోని కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి,

ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల పరిధిలో ఉన్న 183 గ్రామ పంచాయతీలు, 16 వందల 86 వార్డులకు ఎల్లుండి ఎన్నికలు జరుగుతాయన్నారు. 23 గ్రామ పంచాయతీలు, 306 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు.

**(పీటీసీ, ఖమ్మం)**

-------------------------

**సూర్యాపేట-ఎస్పీ**

సూర్యాపేట జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రంతో ముగిసినందున ఓటర్లు కానివారు, స్థానికేతరులు ఆయా గ్రామాలు మండల కేంద్రాలలో ఉన్నరాదని జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవడంలో పోలీసు శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు.

**(పీటీసీ నల్లగొండ జిల్లా)**

---------------------

**మంచిర్యాల-కలెక్టర్**

మంచిర్యాల జిల్లాలో ఎల్లుండి జరిగే రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. వేమనపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ఈ రోజు సందర్శించారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

(పీటీసీ మంచిర్యాల జిల్లా)

-------------------------

**జోగుళాంబ గద్వాల -నవోదయ పరీక్ష**

జోగుళాంబ గద్వాల జిల్లాలో రేపు జరిగే జవహర్ నవోదయ విద్యాలయ అర్హత పరీక్ష కోసం ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు నిషేధాజ్ఞలు విధించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం, శాంతి భద్రతలకు భంగం కలిగించే జన సమూహాలను ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రజలు పూర్తిగా సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

**(పీటీసీ, గద్వాల)**

-----------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ లేకురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దాంతో పాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

**(డెస్క్)**

--------------------------